# సింగిల్ పేజీ కథలు

**-భీమరాజు వెంకటరమణ**

## లాస్యం

కూతురి ఇంట్లో నాలుగు రోజులు ఉండి పోదామని వచ్చిన అన్నపూర్ణమ్మ సాయంత్రం కాఫీ తాగుతూ వరండాలో కూర్చుని ఉండగా ఆమెకు పక్క ఇంట్లో ఉన్న భార్యాభర్తలు వాదులాడుకోవడం స్పష్టంగా వినబడుతోంది. వెంటనే కూతురితో "నీరజా! ఒకసారి ఇలారా" అని మెల్లగా పిలిచి- "కొత్త కాపురం కదా ఎలా ఉన్నావో చూసి పెద్దదానిగా నీకు, అల్లుడికి నాలుగు మంచి మాటలు చెబుదామని వచ్చా! కానీ మీ కంటే ముందు ఈ ప్రక్కింటి వాళ్లకు చెప్పాల్సిన అవసరం ఉందని అనిపిస్తున్నది. ఎందుకంటే భార్యాభర్తలు గొడవ పడుతుంటే జోక్యం చేసుకోవడం సభ్యత కాదని ఎవరన్నా అన్నా సరే! నేను చూస్తూ ఊరుకోలేను. ఒకసారి వెళ్లిరానా? నాకూ ఏమీ తోచటం లేదు?" అడిగింది.

నీరజ పకపకా నవ్వి, "అమ్మా! వాళ్లు దాదాపు నీ వయసు వాళ్లు. ఒకరంటే మరొకరికి ఎంతో ప్రేమ, తమాషా వ్యక్తులు. సరదాగా గొడవ పడుతుంటారు. అనవసరంగా కలుగజేసుకున్నావనుకో ఇద్దరూ కలిసి నిన్ను వెర్రిదాన్ని చేస్తారు" అన్నది.

అన్నపూర్ణమ్మ ఔనా అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది. "కాసేపు ఇక్కడే కూర్చో! నీ సంశయం తీరిపోతుంది" అని నవ్వుకుంటూ లోపలికి వెళ్లిపోయింది.

అన్నపూర్ణమ్మ మరింత ఆసక్తిగా వింటోంది. వాళ్ల వాదన అప్పటికి ఊపందుకుంది.

"పెళ్లయిన కొత్తల్లో నా కాలుకి ముల్లు గుచ్చుకుంటే, ఆ ముల్లుని చేత్తో తీసి పట్టుకొని, దాన్ని నానా తిట్లు తిట్టి గుండ్రాయితో చితక్కొట్టారు. అలాంటి ముల్లే మొన్న గుచ్చుకుంటే 'చూసి నడవటం చేతకాదా' అని కసురుకున్నారు! ఎంత తేడా?"

"లేకపోతే ముళ్లకంపలన్నీ ముందు పెట్టుకొని చితక్కొట్టుకుంటూ కూర్చోమంటావా? నాకు వేరే పని లేదా?" అని తనూ స్వరం పెంచాడు కమలాకర్.

"అప్పట్లో నా ముఖం చూస్తుంటే కాలం గడచిపోతోంది. మరేం అక్కరలేదు అనేవారు. ఇప్పుడు నా ముఖం చూస్తేనే చిరాకు పడుతున్నారు"

"అప్పటి నీ ముఖానికి ఇప్పటి ముఖానికి తేడా లేదా?"

"అప్పట్లో ఎప్పుడూ నీ గురించే ఆలోచిస్తున్నాను రమా అనేవారు"

"ఇప్పుడు మాత్రం? మరోవిధంగా అయినా అదేగా చేస్తున్నది?"

"నేను మీ కోసమే పుట్టాననేవారు"

"ఇప్పుడు మాత్రం మాట మార్చగలనా?"

"నాలాగా ఎవరూ పాడలేరనే వారు"

"ఎప్పుడూ అలాగే అంటాను! ఎవరు పాడగలరు నీలాగ?"

"మీ జీవితం నా కోసమే అన్నారు"

"ఇక కాదనే చాన్సేది?"

"మీ అమ్మాయి నిలువెత్తు బంగారం ఇచ్చినా వద్దు, మీ అమ్మాయే చాలు, అన్నాను మా వాళ్లతో?"

"కుర్రతనం! అర్థంలేని ఆవేశం ఆవేళ అలా మాట్లాడించాయి. నిలువెత్తు కాకపోయినా కనీసం పాదాల ఎత్తైనా బంగారం అడగాల్సింది! ఇప్పుడు ఏమనుకుంటే ఏమి లాభం?"

"ఆ రోజుల్లో నా చేతి వంట అమృతం అని లొట్టలేసుకుని తినేవారు. ఇప్పుడు వంకలు ఎన్ని పెడుతున్నారో!"

"బ్రహ్మచారిగా ఉన్నప్పుడు హాస్టల్లో మెస్సుల్లో తిని నాలుక చచ్చిపోయి అలా అనిపించింది"

"నాకు జబ్బు చేసినప్పుడు విలవిల్లాడిపోయారు?"

"హాస్పిటల్ చుట్టూ తిరిగింది నేనేగా!"

"నన్ను భార్యగా పొందటం మీ అదృష్టం అన్నారు?"

"ఏదో తెలుగు సినిమా చూసొచ్చిన ఆవేశంలో ఆ క్షణంలో అలా అనేశా?"

"అంతేలెండి! మీకు నా మీద ప్రేమ తగ్గిపోయింది. ఇక ఇలా నిర్జీవంగా బ్రతుకుతూ నేనుండలేను"

"అయితే ఇప్పుడేం చేస్తావ్? మీ పుట్టింటికి పారిపోతావా?"

"నాకేం ఖర్మ? ఇక్కడే ఉంటా! నా మైండ్ సెట్‌ని మార్చుకుంటా"

"అబ్బో! అయితే ఏం చేస్తారో రాణిగారు"

"ఎంచక్కా నా బాయ్‌ఫ్రెండ్‌ని రోజూ ఇంటికి రమ్మని అతనిచేత పొగిడించుకుంటా"

"బాయ్ ఫ్రెండా వాడెవడు? ఉన్నట్లుండి ఏమిటీ పిచ్చి ప్రేలాపన ఈ యాభై ఏళ్ల వయసులో?"

"ప్రేమకు వయసుతో సంబంధం లేదని మీరేగా ఒకసారి అన్నారు? మీకేనా పెళ్లి కాక ముందు ప్రేమ కథలుండేవి? మాకుండవా?"

"ఓసి రమాదేవి! కొంప ముంచావు కదే! ఇంతకీ ఎవడు వాడు? పెళ్లయిన ఇన్నేళ్లకి ఇలాంటి బాంబు పేలుస్తావా? ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"మీరు మారిపోయినప్పటి నుండి అతన్ని నా గుండెల్లో పదిలంగా దాచుకున్నాను"

"ఎవరిదే ఆ ఫోటో? మర్యాదగా చూపిస్తావా లేదా?"

"ఇక మీకు నాకు మధ్య మర్యాదలేంటి? నేను తెగించేశా? కావాలంటే ఇదిగో చూసుకోండి ఫోటో"

"ఎవరిదే ఈ బ్లాక్ అండ్ వైట్ ఫోటో? పాత సినిమాల్లో విలన్‌లాగా ఉన్నాడు?"

"విలన్‌లానేగా ఇప్పుడు మాట్లాడటం?"

"అంటే ఏమిటి నువ్వనేది? అర్థమయ్యేట్టు చెప్పవే? ఇక్కడ బీపీ పెరిగిపోతోంది!"

"తమరి ఫోటోకి మీసాలు పెట్టా!"

"ఎంత నాటకమాడావే రమాదేవీ! నిన్నేం చేస్తానో చూడు!"

ఆ తరువాత మాటలు వినబడలేదు అన్నపూర్ణమ్మకి. ఏం జరుగుతున్నదో అని ఇంకా శ్రద్ధగా వినటానికి ప్రయత్నిస్తున్నది. అంతలో నీరజ వచ్చి పక్కన నిలుచుంది. మరో ఐదు నిముషాల్లో మొగుడూ పెళ్లాలిద్దరూ స్కూటరు మీద బయలుదేరి "అమ్మాయ్ నీరజా! మేము సినిమాకు వెళ్తొస్తాం! కాస్త ఇల్లు చూస్తుండు!" అంటూ వెళ్లిపోయారు. అన్నపూర్ణమ్మ నోరెళ్లబెట్టి చూస్తుండగా.